# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న
- జైనథ్, బేల మండలంలోని గ్రామాల్లో ప్రచారం

జైనథ్, నవంబర్ 13 : బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యపడిందని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. ఆదివారం బేల మండలంలోని సాపోనాల, మారుతిగూడ, చాంద్‌పల్లి, భవానిగూడ, బాలుగూడ, పిట్గావ్, చేప్రాల, సోన్కాస్, గణేశ్‌పూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామగ్రామాన జోగు రామన్నకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు వీర తిలకందిద్ది స్వాగతం పలికారు. చాంద్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకు గుస్సాడీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న మాట్లాడుతూ 65 ఏళ్లకు పైగా పాలించిన కాంగ్రెస్, ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీ గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని అన్నారు. ఆదివాసీ గ్రామాలకు రహదారి, వైద్యం, శుద్ధజలం సరఫరా వంటి మౌలిక వసతులను కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో జిలా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రౌత్ మనోహర్, జడ్పీటీసీ అక్షిత పవార్, సర్పంచ్ జంగ్ షావ్, మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, నాయకులు గంభీర్ ఠాక్రే, సతీశ్ పవార్, సుదర్శన్, సంతోష్ పటేల్, సోనేరావ్, సుదర్శన్ పాల్గొన్నారు.



జైనథ్: బేల మండలంలో ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

### బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను పాతరవేయాలి

జైనథ్, నవంబర్ 13 : రైతులను మోసం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను పాతరవేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని కౌఠ, సాంగ్వి, సాంగ్వి(కే), పెండల్వాడ, సావాపూర్, ఆకుల బాలాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూల వర్షం కురిపిస్తూ వారి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల కోడ్ సాకు చూపిస్తూ రైతుబంధు నిలిపియాలంటూనే మళ్లీ అదే రైతుల వద్దకు ఓట్లు ఏ ముఖం పెట్టుకొని అడగడానికి వస్తున్నారని, రైతులపై మోటర్లు ఎక్కించి మరి చంపించిన వారిని నిలదీయాలని అన్నారు. సంక్షేమ పథకాల్లో టాప్‌లో ఉన్న తెలంగాణ రానున్న ఏప్రిల్ నుంచి మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందించనుందన్నారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసి దశల వారీగా సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.



జైనథ్ : సావాపూర్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

### భారీగా బీఆర్ఎస్‌లో చేరికలు

భోరజ్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అలిసెట్టి రాజారెడ్డి అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాసం నర్సింగ్‌రావ్, ప్రభాకర్, నాయకులు ఊశన్న, రైతు బంధు సమితి మండల కన్వీనర్ ఎస్ లింగారెడ్డి, సర్పంచ్‌లు విఠల్, సురేశ్, చందమమత, జక్కుల వినోద్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పురుషోత్తం యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారు గుర్తుకు ఓటు వేసి .. గెలిపించండి



ఆదిలాబాద్‌రూరల్ : బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 13 : ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతుంది. పార్టీ అభ్యర్థి, నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పట్టణంలోని కొలిపుర, పంజేశా కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, నాయకులు కొండ గణేశ్, రఘు, సంతోష్, బాదన్ గంగన్న పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో..



ఎదులాపురం: ఓటు అభ్యర్థిస్తున్న జిల్లా అధికారి ప్రతినిధి గంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్

ఎదులాపురం, నవంబర్ 13 : జిల్లా కేంద్రంలోని 30వ వార్డు ఖానాపూర్‌లో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, వార్డు ఇన్‌చార్జి గంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న విజయం కోసం నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు. అయుబ్, జాన్సన్, వెంకటి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్



ఎదులాపురం: న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో ప్రచారం చేస్తున్న డీసీసీబీ చైర్మన్, నాయకులు

తెలంగాణ రాష్ట్రంలో మరోసారి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ అవుతారని అదేవిధంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా జోగు రామన్న మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని 12వ వార్డు న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో కౌన్సిలర్ పవన్ నాయక్, బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి చిలుక విలాస్, వార్డు సభ్యులు ఖలీమ్, శ్రీకాంత్, స్వామి, ఆశీర్వాదం, అశోక్, శ్రీను, మున్నిబి, గీత, శీల, లక్ష్మి, రాధ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొట్టుపెడుతూ ప్రచారం

పట్టణంలోని కొలిపూరలో బీఆర్ఎస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు స్వరూపారాణి ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. గడపగడపకూ తిరిగి మహిళలకు బొట్టుపెట్టి బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలు అందశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మాజీ ఆర్గనైజర్ కస్తాల ప్రేమల, పట్టణ కార్యదర్శి కరుణ, కార్యకర్తలు సంగీత, సురేఖ, తాహసిం, సుకన్య పాల్గొన్నారు.

## ప్రమాద బీమా రూ.5లక్షల వర్తింపు

ఎదులాపురం, నవంబర్ 13 : సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో రూ.5లక్ష ప్రమాద బీమా, రూ.15లక్షల వరకు ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసుకునే వేసుబాటు ఉందని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బండారి సతీశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 27వ వార్డులో ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రచారం నిర్వహించారు. భవన నిర్మాణ పని చేస్తున్న కార్మికుడి సహాయం చేస్తున్న పథకాలను వివరించారు. ఎన్నికలో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న గెలిపించాలని కోరారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్లు, నాయకులు కొండ గణేశ్, దమ్మపాల్, ప్రకాశ్, లక్ష్మణ్, పండ్ల శ్రీను, అశోక్‌స్వామి గుండావార్ సంతోష్ ఉన్నారు.

## మరోసారి ఎమ్మెల్యేగా జోగు రామన్నను గెలిపించాలి

ఎదులాపురం,నవంబర్13: ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు యూనిస్ అక్బానీ కోరారు. పట్టణంలోని కొలిపూర,శాంతినగర్, బొక్కలగూడలలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రఘు,సంతోష్, పండ్ల శీను, బాదం గంగన్న తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ప్రచార కరపత్రాన్ని అందజేస్తున్న సీనియర్ నాయకుడు యూనిస్ అక్బానీ

## కోవలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

నార్నూర్, నవంబర్ 13 : ఆసిఫాబాద్ నియోజక వర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని పార్టీ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి(హెచ్)పంచాయతీ పరిధిలోని మాల్కుగూడలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భీంపూర్ సర్పంచ్ రాథోడ్ విష్ణు, ఎంపీటీసీ జాదవ్ రేణుకాదీలిప్, నాయకులు జాదవ్ బాపురావ్, రాథోడ్ వసంత్‌రావ్, గుణవంత్‌రావ్, అరవింద్ పాల్గొన్నారు.



.మాల్కుగూడలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

## బైక్‌పై నుండి పడి ఒకరి మృతి

బజార్‌హత్నూర్, నవంబర్ 13 : బజార్‌హత్నూర్‌లోని శివాజీ విగ్రహం వద్ద ఇచ్చోడ నుంచి సోనాల వైపు వెళ్లే ప్రదాన రహదారిపై వేగంగా వచ్చి ఒకరు బైక్‌పై నుంచి పడి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేశ్ వివరాల ప్రకారం.. సోనాల గ్రామానికి చెందిన విద్యాసాగర్(32) ఇచ్చోడ నుంచి సోనాల వైపు ప్రదాన రహదారి గుండా వెళ్లే క్రమంలో బజార్‌హత్నూర్‌లోని శివాజీ విగ్రహం వద్ద అతివేగంతో బైక్ రావడంతో అదుపు తప్పి సోనాల నుంచి బజార్‌హత్నూర్ వైపు వెళ్లేమార్గంలో ఉన్న ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించే క్రమంలో మార్గ మధ్యంలో మృతి చెందాడు. విద్యాసాగర్ బావ గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## భారీ అగ్ని ప్రమాదం : రూ. 35లక్షలు ఆస్తినష్టం

ఎదులాపురం, నవంబర్ 13 : ఆదిలాబాద్‌లో దీపావళి పండుగ వేళా అగ్ని ప్రమాదం సంభవించింది. జిల్లా కేంద్రంలోని సినిమా రోడ్‌లో గల శ్రీనివాస ఎంటర్‌ప్రైజేస్‌లోలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటన స్థలానికి అగ్నిమాపక అధికారి దుర్గె శివాజీతో సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.35లక్షల విలువ చేసే సామగ్రి కాలి బూడిదైనట్లు అధికారి తెలిపారు.

## ఇరువర్గాలపై కేసు నమోదు

జైనథ్, నవంబర్ 13: శాంతి భద్రతలకు విఘాతం కలిపించిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ తెలిపారు. బేల మండల చప్రాల గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహిస్తుండగా మరో పార్టీ నాయకులు అడ్డుకోవడంపై ఇరుపార్టీలపై కేసు నమోదు చేశారు.